ఆ సాయంత్రం ఆఫీసు గదిలోకి వచ్చిన పోలయ్య—

"ఆస్పత్రికి ఫోను చెయ్యండి బాబూ..." అన్నాడు ఆత్రుతగా.

"ఏ ఆస్పత్రికీ? ఎందుకూ?" అన్నాను.

"పెద్దాసుపత్రికి...బావానగరు వార్డులో పాదాలు కొడుకుని చేర్పించేరు...వాడి పరిస్థితి బాగోలేదండి." అన్నాడు. ఆ సమయంలో పోలయ్య మనసులో ఆస్పత్రి, రోగి అన్న ధ్యాస మినహా అతన్లో ఆఫీసూ, హోదా తారతమ్యం కనపడలేదు.

మామూలుగా అయితే అంతదూరాన ఒదిగి నిల్చుని చెప్పిన పని చెవికి ఎక్కించుకునేవాడు. ఇప్పుడు మాత్రం టేబులు మీద చేతులేసి ఫోను మీదే దృష్టి కేంద్రీకరించాడు.

రిసీవరెత్తి పి. బి. ఎక్స్‌కు డయల్ చేయడం...బావానగరు వార్డుకు కనెక్షన్ రావటం నిముషంలో జరిగింది. పాదాలు బంధువులు ఫోన్లో మాట్లాడేరు...పేషెంటుకి ఆక్సిజన్ పెట్టేరట...అంతే అంతకుమించిన వివరాలు చెప్పలేదు వాళ్ళు.

ఆ మాట విన్న పోలయ్య మౌనంగా వెలుపలికెళ్ళాడు. పాదాలు అంటే తెలియని వాళ్ళు లేరు. అతను చెప్పిన పని 'కాదు' అనకుండా చేస్తాడు. బియ్యం, నూనె, మిరపకాయలు వగైరా ఇళ్ళకు మోస్తాడు. టిఫిన్లు, కాఫీలు ఎవరు ఏది చెప్పినా చిటికలో చేస్తెయ్యడం వల్ల పాదాలు అందరికీ ఇష్టుడే.

ఇక పాదాలుకొడుకు అంజయ్య తండ్రికంటే ఎక్కువ పేరు తెచ్చుకున్నాడు. ఏరాత్రి వేళో మందులు కావలసివస్తే కొండదిగి మందులు తెచ్చేవాడు. కొండమీద ఆలయం చుట్టూ ఊరున్నా ఇంకా మందులూ, వైద్య సదుపాయాలూ లేవు. అందుచేత అలాంటి వాతావరణంలో పాదాలూ, అతని కొడుకు అంజయ్యా ప్రజలకు కొండంత అండగా ఉన్నారు. నిజమే అలాంటి వాళ్ళకి ఆపద వస్తే ఆత్రుతపడ్డం సహజం.


అప్పటికి రాత్రి ఎనిమిది కావడంతో లోపలికి పిలుపొచ్చింది. రాత్రి ఏడింటికి దర్శనాలు ఆపి ఆరాధన మొదలుపెడతారు. పారాయణ, సేవాకాలం, ధూపం, బలిహారణ అయ్యాక, తీర్థం, వినియోగాలు అవుతాయి. మళ్ళీ ఎనిమిదిన్నరకు దర్శనాలు మొదలౌతాయి. తొమ్మిది గంటలవరకూ దర్శనాలు ఇచ్చి...తొమ్మిదీ పది నిముషాలకు సింహాద్రినాథునికి పవళింపు సేవ చేస్తారు.

ఆఫీసు గదిలోంచి కోవెలలోకి వెళ్ళాక గోష్ఠి మొదలైంది. గోష్ఠిలో చివరగా నిల్చుని పోలయ్య కనిపించాడు. అతని షిఫ్టు ఒంటి గంటతో అయిపోయింది. అయినా అతను కోవెలలోనే ఉన్నాడు. అతని వదనంలో చిరుమేఘంలా విషాదం. అది కేవలం అంజయ్యను గురించే.

గోష్ఠి తరవాత మళ్ళీ దర్శనాలు మొదలైనాయి. అరగంట సేవా మళ్ళీ ఫోనూ... ఆఫీసూ...లోపలికెళ్ళగానే పోలయ్య వచ్చాడు. "బాబూ...అంజయ్యకు చిల్లంగి తగిలిందండీ" అన్నాడు రహస్యం చెబుతున్నట్లు.


"ఎక్కడుంది? ఎలా తగిలింది" అన్నాను ఆశ్చర్యంగా. ఈ చిల్లంగి గురించి అక్కడక్కడా వింటున్నా వినీ విననట్లు వెళ్ళడం జరిగేది.

"సంగప్ప ఉన్నాడు కదండీ వాడు పెడతాడు



# నిజం

గట్టా వెంకటేశ్వర్లు



చిల్లంగి. మొన్న అంజయ్యకూ, వాళ్ళ బంధువులకూ తగాదా వచ్చిందండి. వాళ్ళు సంగప్పచేత అంజయ్యకు చిల్లంగి పెట్టించారు. ఏమవుతుందో ఏమో? వాడు చిల్లంగి పెడితే బతికినోడు లేడండీ అన్నాడు.

చీకటీ వెలుగూ దేవుడూ దయ్యాలూ పవిత్రమైన చోట ఇలాంటి కుయుక్తులు ఎందుకో? ఒకరి ప్రాణం మీద వేరొకరికి కంటగింపు. పుట్టినవాడు గిట్టక తప్పదు. ఎవరెవరి రాతల్ని బట్టి వాళ్ళకు ఆయా బుద్ధులు వస్తాయి. ఒకడు తాగుబోతు. ఒకడు దొంగ. ఒకడు వేదాంతి. వేరొకడు బలవంతుడు. అయినా వీళ్ళంతా చివరకు చేరేది వసుధ తల్లి ఒడిలోకే. ఒక తల్లి కన్నబిడ్డ పై వేరొకరికి కోపం. ఇదంతా తెలిసీ తెలిసీ చేస్తున్న పొరపాటు. అంతేగాని మనిషి ఎన్ని అతీతమైన శక్తుల్ని సంపాదించినా చివరికి వాడూ మరణిస్తాడు.

ఇంతలో పవళింపు గంట మోగింది. అష్టదిక్పాలకుల సేవ అనంతరం పవళింపు, కవాట బంధనం జరిగాయి. స్థానాచార్యులు, అర్చకులూ మిగతా సిబ్బందీ వచ్చారు. బస్సు కొండ దిగువకు బయలుదేరింది. రాత్రి సేవల అనంతరం కోవెల సిబ్బంది కొండ దిగువకు వస్తారు.

ఘాట్ రోడ్డెంట వస్తున్న బస్సులో పిచ్చాపాటీ మాట్లాడుతున్నారు—అర్చకులు వాళ్ళమ్మాయి నృత్యం గురించీ, హవల్దారు భూమి తగాదా గురించీ, బస్సు డ్రైవరు ఘాట్ రోడ్డులో తిరిగే అడవి జంతువుల గురించీ. తన మనసు మాత్రం అంజయ్య గురించే ఆలోచన. మొన్నటివరకూ పందెంగిత్తలా తిరిగిన అంజయ్య హఠాత్తుగా మంచం పట్టాడు. బస్సు కొండ దిగువకు చేరింది. బస్సు దిగి వస్తుంటే పురూరవ పావుల వద్ద నిల్చున్న జనంలో కనిపించాడు సంగప్ప. మనిషి చదువులేకపోయినా నిండుగా నిమ్మకు నీరెత్తి నట్లుంటాడు. సూర్యాస్తమయం అయిందంటే అతని కళ్ళు చింతనిప్పుల్లా వెలుగుతుంటాయి. ఊరంతా అతని కళ్ళలోని ఎరుపుదనం క్షుద్రోపాసన అంటారు. కొందరు తాగినమైకం అంటారు. ఆ సమయంలో సంగప్పని పలకరించకుండా అడుగు ముందుకు పడలేదు.

"ఏం సంగప్పా ఇక్కడున్నావేం?" అనగానే నిల్చున్న చోట నుండి ఒక్క అడుగైనా ముందుకేయకుండా... "పనుంది..." అన్నాడు.

అతను ఆ మాట అనడానికి నోరు తెరచినప్పుడు గుప్పున వచ్చింది. సారా వాసన! తన లాంటి వాళ్ళు అలాంటి వాళ్ళను పలుకరించకనే కూడదు. తీరా పలుకరించి అతని నోటెంట పెడసరంగా సమాధానం విన్న తరవాత అలా అతణ్ణి వదలి వెళ్ళకూడదు.

"నీతో నాకూ పనుంది...అందుకే పలకరించాను" అన్నాను.

ఆ మాటతో అతనికి చలనం కలిగింది. కాస్త దగ్గరకు వచ్చి "ఏం పనండి?" అన్నాడు నెమ్మదిగా.

"చెప్తాను రా..." అన్నాను.

అతను తనని అనుసరించాడు. అప్పటికి రాత్రి పది దాటుతోంది. చౌల్ట్రీల్లో బిజీగా ఉంటుంది. రాత్రి లాస్ట్ బస్సులకు వచ్చిన యాత్రికులు గదులు అద్దెకు తీసుకుంటారు.

తాను తన వెంట సంగప్పతో సత్రం గదుల ఆఫీసు కెళ్ళేసరికి అక్కడ చిన్నగారు, శివరామ్‌గారూ ఉన్నారు. వారిద్దరూ రాత్రి షిఫ్టులో పని చేస్తారు.

సంగప్పని వెలుపల బెంచీ మీద కూర్చోమని ఆఫీసు గదిలోకి వెళ్ళను.

"అదేంటి గురూ...వాణ్ణి వెంట బెట్టుకొచ్చావ్?" అన్నాడు చిన్న ఆశ్చర్యంగా.

"అత నంటే నీకూ భయమేనా?" అన్నాను.

"భలే వాడివే...వాడు ఎలాంటి వాడో వినలేదా? రాత్రులు ఒక తాటాకు మంత్రించి మామిడి చెట్టుకు కడితే ఎవ్వడూ ఆ తోటలోకి వెళ్ళడు. మళ్ళీ ఉదయం వాడొచ్చి ఆకు తీసేయాలి" అన్నాడు.

చిన్న డ్రామాలు వేస్తాడు. అతను ఆంజనేయుడి వేషం వేసి స్టేజి ఎక్కితే స్టేజికి నిండుగా ఉంటాడు. ఇక శివరామ్ సంఘ సంస్కర్త. ఈ ఇద్దరూ తనకు సన్నిహితంగా సహకరిస్తారు. అందుకే సంగప్ప విషయం వాళ్ళ సహకారంతో తేల్చేయాలి.

"సంగప్ప అంజయ్యకు చిల్లంగి పెట్టేడట" అన్నాను.

ఆ మాట విని ఇద్దరూ నోళ్ళు తెరిచారు. "పాపం అంజయ్య మంచివాడు" అన్నారు.

"అందుకే సంగప్ప సంగతి తేల్చేద్దాం" అన్నాను.

ఆ మాట వినగానే చిన్న..."సంగప్పా..." అన్నాడు. బెంచి మీద కూర్చొని వేళ్ళు లెక్క పెడుతూ పైకి చూస్తున్న సంగప్ప ఉలిక్కిపడి లేచాడు.

"ఇలారా..." అన్నాడు చిన్న.

అతను లేచి లోపలి కొచ్చాడు.

గది తలుపు మూసి రూళ్ళ కర్ర అందుకున్నాడు చిన్న.

"అంజయ్యకు చిల్లంగి పెట్టేవట...ఎందుచేత? నీకూ అతనికీ ఉన్న పగ ఏమిటి? అంజయ్య మా శిష్యుడని తెలీదా?" అన్నాడు ఉరిమిచూస్తూ.

"తేల్చేయ్ గురూ...వీడి సంగతి...మక్కెలిరగతన్ని పోలీసు స్టేషన్‌కి తీసుకెళ్దాం..." అన్నాడు శివరామ్.

"అలాగే చెయ్యండి. యస్సై రాములు చాలా స్ట్రిక్టు. ఇతన్ని అప్పగిస్తే కేసు బనాయించి కోర్టుకు అప్పగిస్తాడు" అన్నాను.

వెంటనే చిన్న అతని చొక్కా కాలరందుకుని రూళ్ళ కర్రెత్తాడు. దాంతో తాగినమైకం వదలినట్టు...

"ఆగండి...ఆగండి...బాబూ...చిల్లంగి నేర్చుకునే ఓపికా, ధైర్యమూ నాకెక్కడియ్యి? ఏదో గోసాయి చిట్కాలు చేసి పొట్ట నింపుకుంటున్నాను" అన్నాడు సంగప్ప.

"చిట్కాలా-ఎలా చేస్తున్నావు?" అన్నాడు శివరామ్।

"ఏముంది బాబూ...మడిసికి బయం కలిగించాల... అంతే. నేను జిల్లేడుపాలూ...నీళ్ళు సున్నం...చింతపండూ కలిపిన మాత్ర ఒకటి మేము చిల్లంగి పెట్టాలనుకున్న వాడికి కాఫీ ద్వారానో కల్లు ద్వారానో, ఇప్పిస్తాం. ఆ తరవాత నా శిష్యుడు కొండడు వీడికి సంగప్ప చిల్లంగి పెట్టేడు అని ఇంకోడితో చెబుతాడు. వాడెళ్ళి అసలు వాడికి చెబుతాడు. ఈ లోపల జిల్లేడుపాల మాత్ర కడుపులో పని చేయడం ప్రారంభిస్తుంది. ఈ వార్త విని భయంతో వణికిపోతాడు. దాంతో విరేచనాలు మొదలౌతాయి. విరేచనాలకు మందు వాడతారు. అయినా భయం వదలదు కాబట్టి బీరగుంట సక్కేటుగాడి చేత బాగు చేయిస్తారు. వాడు తీసుకునే మూడు వందలు మాకు చెరో నూట యాభై. అయినా బాబూ మడిసి నిజంగా చచ్చినా అది నా వల్లే అనుకుంటారు. ఆ బాధతో నేను కుమిలి పోతున్నాను. ఇది ఎలా చెప్పాలా, ఈ చిల్లంగి రొంపిలోంచి బయటపడి అందరిలా నేనూ మంచివాడిగా ఎలా తిరగాలా అని చూస్తున్నాను...తమరు నా మంచికోసం ఈ రోజు ఇక్కడికి తీసుకొచ్చారు" అన్నాడు. అతని కళ్ళలో కన్నీళ్ళు. నేతి బీరకాయలో నెయ్యి తెలిసిపోయింది.

అయినా ప్రయోజనం లేకపోయింది. ఇది మానసిక భ్రమ అని తెలియకముందే, లేక శరీరంలో అతీతమైన రుగ్మత చేతనో ఆ మరునాడు ఉదయమే అంజయ్య అసువులు బాశాడు.